## బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

# బంగారు గౌరమ్మ ఉయ్యాలో..

- ఆడిపాడిన ఆడబిడ్డలు
- అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు
- వేడుకలకు ఏర్పాట్లు చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు



బెల్లంపల్లి : బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు



కాసిపేట : సోమగూడెంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బెల్లంపల్లి, అక్టోబర్ 22: సద్దుల బతుకమ్మ వేడుకలను మున్సిపాలిటీ పరిధిలోని 34 వార్డుల్లో ఆదివారం రాత్రి బెల్లంపల్లిలో మహిళలు, యువతులు వైభవంగా నిర్వహించారు. ఉదయం బజార్ ఏరియాలో బతుకమ్మ సందడి కనిపించింది. బజార్ ఏరియా నుంచి కాంటా చౌరస్తా వరకు తాత్కాలిక పూల దుకాణాలు వెలిశాయి. మహిళలు పోటీ పడి మరీ పువ్వులను కొనుగోలు చేశారు. ముఖ్య కూడళ్ల వద్ద బతుకమ్మల చుట్టూ పాటలు పాడుతూ ఆడారు. పోచమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. వేడుకలకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**తాండూర్‌లో..**

తాండూర్, అక్టోబర్ 22 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ పండుగ, పూలతో చేసిన దేవత బతుకమ్మ పండుగను మండలంలోని మహిళలు ఆదివారం ఘనంగా, ఆనందోత్సాహాలతో, వైభవంగా నిర్వహించారు. సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో మాదారం టౌన్‌షిప్‌లోని కోదండ రామాలయంలో సద్దుల బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించి ఉత్తమ బతుకమ్మలకు బహుమతులను అందజేశారు. బతుకమ్మ పండుగతో మహిళల్లో స్నేహభావం ఏర్పడుతున్నదని బోయపల్లి ఎంపీటీసీ, బుగ్గ దేవస్థానం చైర్ పర్సన్ మాసాడి శ్రీదేవి అన్నారు. అనంతరం బతుక్మ వేడుకల్లో పాల్గొన్నారు. తాండూర్ మండల కేంద్రంలోని శ్రీ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఐబీకి చెందిన మహిళలు సద్దుల బతుకమ్మ కార్యక్రమాన్ని వైభవంగా, కోలాటాలు ఆడుతూ ఘనంగా నిర్వహించారు.

**నెన్నెలలో..**

నెన్నెల, అక్టోబర్ 22: నెన్నెల మండలంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. పండుగత సందర్భంగా పూలకు గిరాకీ పెరిగింది. సాయంత్రం నుంచి వీధుల్లో బతుకమ్మలను ఏర్పాటు చేసి ఆట పాటలు, కోలాటాలు ఆడుతూ పాడుతూ సంబురాలుసుకున్నారు.

**కన్నెపల్లిలో..**

కన్నెపల్లి, అక్టోబర్ 22 : కన్నెపల్లి మండలంలో సాయంత్రం గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలు ఉంచారు. బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

**వేమనపల్లిలో..**

వేమనపల్లి, అక్టోబర్ 22 : వేమనపల్లి మండలంలో రక రకాల పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను పెట్టి పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లోని చెరువులు, వాగులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

**కాసిపేటలో..**

కాసిపేట, అక్టోబర్ 22 : కాసిపేట మండలంలో ఆయా గ్రామాల్లో ఆదివారం సద్దుల బతుకమ్మ సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. సోమగూడెం భరత్ కాలనీ, కాసిపేట, దేవాపూర్, కొండాపూర్ యాప, దుబ్బగూడెం, మల్కెపల్లి, ధర్మరావుపేట, ముత్యంపల్లి, సోనాపూర్, కోనూర్, పెద్దనపల్లి, కొమటిచేను, పల్లంగూడ తదితర గ్రామాల్లో సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.



తాండూర్ : ఐబీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



తాండూర్: బోయపల్లిలో బతుకమ్మ ఆడుతున్న ఎంపీటీసీ, బుగ్గ దేవస్థానం చైర్ పర్సన్ మాసాడి శ్రీదేవి, మహిళలు



కన్నెపల్లి : బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నెన్నెలలో..

## నేడు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పర్యటన

బెల్లంపల్లి, అక్టోబర్ 22: నెన్నెల మండలం కష్నపల్లిలో సోమవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పర్యటించనున్నారు. గ్రామంలో నిర్వహించే విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

## రావణ దహన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి

బెల్లంపల్లి, అక్టోబర్ 22: హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని తిలక్ స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించనున్న రావణ దహన కార్యక్రమానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత ఐదు రోజుల నుంచి అవిశ్రాంతంగా శ్రమించి రావణ దహన ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం 6.30కు కార్యక్రమం ప్రారంభం కానుంది.కార్యక్రమాన్ని పార్టీలకతీతంగా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మాజీ ఎంపీ వివేక్, మాజీ ఎమ్మెల్యేలు వినోద్, శ్రీదేవిలు ప్రారంభించనున్నారు. స్టేడియంలో ప్రత్యేకంగా స్టేజీ, వీఐపీ, ఇతర గ్యాలరీలను ఏర్పాటు చేశారు. పది వేల మంది కార్యక్రమాన్ని తిలకించే విధంగా స్టేడియంను తీర్చిదిద్దారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు కే.నగేష్ కుమార్, సభ్యులు సూరం లక్ష్మినారాయణ, మద్దెర్ల శ్రీనివాస్, కాసర్ల తిరుపతి, బగ్గని శేషుకుమార్, పూదరి సత్యనారాయణలు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.



ఏర్పాట్లు చేస్తున్న కార్మికులు

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

బెల్లంపల్లి, అక్టోబర్ 22: పట్టణంలో సుభాష్ యూత్ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రి వేడుకల్లో భారతీయ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. డీజే డ్యాన్స్‌లు కాకుండా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని స్థానికులు ప్రశంసించారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

## అల్పాహారం పంపిణీ

బెల్లంపల్లి, అక్టోబర్ 22:బెల్లంపల్లి తిలక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని మార్కెట్ ఏరియాలో అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో తిలక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు రాజన్న, రామన్న, జయరాం, వెంకట్రాజం, శంకర్, కనకయ్య,శ్రీనివాస్, అనిల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.